క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం

బంటుమిల్లి: స్థానిక గీతా మందిరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో పెడన నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంతోపాటు మండలంలో పార్టీ బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చిస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైతుబజారులో ప్లాస్టిక్ నిషేధం

పెడన: పెడన రైతుబజారులో ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్టేట్ అధికారి సురేష్‌కుమార్ సిబ్బందిని హెచ్చరించారు. రైతుబజారులో కూరగాయలు విక్రయించే సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. కొందరు ప్లాస్టిక్ వాడకూడదని చెప్పినా పెడచెవిన పెడుతున్నారని, ఈ పరిస్థితి ఇంకా కొనసాగిస్తే మాత్రం సహించేదని లేదని తెలిపారు. భారీగా జరిమానా విధించాల్సి ఉంటుందని చెప్పారు. నిబంధనల మేరకు ఎటువంటి సంచులను విక్రయించాలో వాటిని మాత్రమే అమ్మకాలు చేయాలని సూచించారు.

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన

కోడూరు: మండలంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రహదారులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శనివారం పరిశీలించారు. పోటుమీద గ్రామంలో రూ.13 లక్షలతో రహదారి పనులు జరుగుతున్నాయి. నాణ్యతను పరిశీలించి, రోడ్ల నిర్మాణంలో వినియోగిస్తున్న మెటీరియల్‌ను తనిఖీ చేశారు. నిబంధనలకు లోబడి పనులు చేయాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ కె.వరప్రసాద్ సూచించారు. అనంతరం ఇటీవల జెడ్పీ నిధులతో వేసిన పలు పనులను కూడా పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈ రాధాకృష్ణ, పీఆర్ డీఈ పి.సురేష్‌బాబు, ఏఈ విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలకు తరలిన సీపీఐ నేతలు

చల్లపల్లి: ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు చల్లపల్లి నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. శనివారం నుంచి 25వ తేదీ వరకూ మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు అవనిగడ్డ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వంద మందికిపైగా వాహనాల్లో ర్యాలీగా వెళ్లినట్లు స్థానిక నాయకులు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా జెండా ఊపి ప్రారంభించారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: మూడు స్తంభాల సెంటర్‌లోని అన్న క్యాంటీన్లో రూ. 75 వేల రూపాయల వ్యయంతో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు మాట్లాడుతూ నగరానికి చెందిన వైద్యుడు ధన్వంతరి తమ వంతు సహాయంగా గత సంవత్సరం లక్ష రూపాయలు, ఈ సంవత్సరం కూడా మరొక లక్ష అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం వారి మనవడు డాక్టర్ బి.వి. వివేక్, డాక్టర్ వైష్ణవిల వివాహం సందర్భంగా ముందుకు వచ్చి అన్న క్యాంటీన్లో 75 వేల రూపాయల వ్యయంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాల్ రావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై కూటమి కక్ష సాధింపు

నాగాయలంక: కూటమి ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులపై కక్ష సాధింపు చేపట్టడం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ చెన్ను రంగారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమాయకులైన పేదలకు చెందిన పింఛన్లు ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గపు పరిపాలనకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. అడుగు తీసి అడుగు వేయలేని దివ్యాంగులకు సైతం పింఛన్లు రద్దు చేశారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు.

ఫైనల్ ఇంటర్వ్యూకు 19 మంది అర్హత

చల్లపల్లి: వివేకానంద డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న బీకాం, బీఎస్సీకి చెందిన 19 విద్యార్థులు టీసీఎస్ ఫైనల్ ఇంటర్వ్యూకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.రమేష్ శనివారం తెలిపారు. ఆగస్టు 9వ తేదీన విజయవాడలో నిర్వహించిన పరీక్షకు కళాశాల నుంచి 58 మంది విద్యార్థులు హాజరుకాగా తాజాగా విడుదలైన ఫలితాల్లో 19 మంది ఎంపికై నట్లు చెప్పారు. అర్హత సాధించినవారిని ప్రిన్సిపాల్ పి.రమేష్‌తోపాటు ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

ఎడ్లంక సమస్యపై చిత్తశుద్ధితో స్పందించాలి

గ్రామస్తుల దీక్షకు మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్



నిరసన దీక్షకు మద్దతు తెలిపి గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ఎడ్లంక (అవనిగడ్డ): ఎడ్లంక గ్రామ సమస్యలపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. అవనిగడ్డ మండలం పాత ఎడ్లంక గ్రామంలో వరద వల్ల కోతకు గురవుతున్న గ్రామానికి రక్షణ గోడ, గ్రామానికి వంతెన, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మించాలని, పొలం కోల్పోయిన వారికి పొలం ఇప్పించాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్షకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, మాజీ డీసీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దీక్షలోని గ్రామస్తులు కృష్ణానది వరదల వల్ల తమ గ్రామం కోతకు గురవుతుందని తెలిపారు. ఇప్పటికే పలు నివాసాలు నదిలో కొట్టుకుపోయాయని ప్రభుత్వం తమకు ఏ న్యాయం చేయడం లేదనే ఆవేదనతో నిరసన దీక్ష చేపట్టినట్లు తెలిపారు. స్పందించిన సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ కోతకు గురవుతున్న ప్రాంతంలో రక్షణ గోడ కట్టించి రక్షించాలన్నారు. నివాసాలు కోల్పోయిన వారికి తక్షణమే గృహాలు కట్టించి ఇవ్వాలన్నారు. తమ హయాంలో ఎడ్లంక గ్రామానికి బ్రిడ్జి నిర్మాణానికి రూ.8.5 కోట్ల నిధులతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రపోజల్ పట్టించుకోవడం లేదని తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా స్పందించాలి....

ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలకతీతంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణానికి తమ ప్రభుత్వం రూ.109 కోట్లు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచిందని, కూటమి ప్రభుత్వం వచ్చి ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ఎడ్లంక గ్రామస్తులపై ఎక్కడలేని ప్రేమ వలకబోసారని గద్దెనెక్కాక వారి సమస్యలపై శీతకన్ను వేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం, నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ దృష్టికి ఎడ్లంక సమస్యలను తీసుకెళ్లి తద్వారా గ్రామాన్ని పూర్తిగా రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీ నారాయణ (లచ్చి), వైఎస్సార్ సీపీ ప్రచార రాష్ట్ర కార్యదర్శి జయగోపాల్, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, పాత ఎడ్లంక మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, గ్రామ కన్వీనర్ నలకుర్తి రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు గరికిపాటి కృష్ణారావు, దాసినేని శ్రీనివాసరావు, అన్నపరెడ్డి పరమాత్మ, ఆంజనేయులు తదితరులున్నారు.

పల్లోటి లేఅవుట్‌లో పట్టపగలే చోరీ

పెడన: జగనన్న కాలనీ పల్లోటి లే అవుట్‌లో పట్టపగలే దొంగలు హల్‌చల్ చేస్తుండటంతో కాలనీలో నివాసం ఉంటున్న వారు భయాందోళన చెందుతున్నారు. కాలనీలో నివాసం ఉండే తిరువీధుల నాగ శివకుమార్ తాపీపని చేసుకుంటున్నాడు. ఆయన భార్య శిరీష కలంకారీ పనులకు వెళ్తుంటుంది. పిల్లలు బడికి వెళ్లిపోతారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఇంట్లో వారంతా ఎవరి పనులకు వారు వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి వచ్చిచూస్తే మెయిన్‌గేటు, ప్రధాన ద్వారం వేసినవి వేసినట్లుగానే ఉన్నాయి. పక్క ద్వారాన్ని పగలగొట్టి, బీరువాను చాకచక్యంగా తీసేసి చోరి చేశారు. సుమారు రూ.3లక్షలు విలువ చేసే బంగారం వస్తువులు, రూ.7వేలు నగదు అపహరించుకుపోయారని బాధితులు వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు పేర్కొన్నారు. కాలనీలో చాలా చోట్ల చోరీలు జరిగాయని, ఒక ఇంట్లో రూ.50వేలు పోయాయని, కోళ్లు, మోటార్లు కూడా ఎత్తుకుపోతున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు.

ఎంపీపీ స్కూల్ ఆదర్శవంతంగా నిలవాలి

ఘంటసాల: గ్రామస్తులు, దాతల సహకారంతో అభివృద్ధి చెందుతున్న పెద్దగూడెం ఎంపీపీ స్కూల్ పలువురికి ఆదర్శవంతంగా నిలవాలని ఎన్నారై గొర్రెపాటి రంగనాథబాబు అన్నారు. పెద్దగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ దాతలైన ఎన్నారై రంగనాథ బాబు, మాలెంపాటి సీతారామాంజనేయులు కుమార్తెలు అత్తలూరి రాజేశ్వరి – కోటేశ్వరరావు దంపతులు, ఎన్నారై యనమదల మాధవిలు పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని, సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులను అభినందించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం



విద్యార్థులతో ఎంపీపీ స్కూల్ నిర్మాణ దాతలు

సబ్బినేని శ్యామల, ఉపాధ్యాయురాలు అవనిగడ్డ భార్గవి, గ్రామ పెద్దలు దిరిశం పిచ్చేశ్వరరావు, నందేటి శ్రీనివాసరావు, కొడాలి గంగాధరరావు, కొండపల్లి సందీప్, దిరిశం శ్రీను, మట్టా వెంకటేశ్వరరావు, కొల్లూరి అబ్రహం, దిరిశం సునీత పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణ కోసమే గోశాల

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



గోశాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో కలెక్టర్ డీకే బాలాజీ

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో రహదారి ప్రమాదాలు నివారించేందుకు గోశాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర గనులు భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలసి శనివారం గోశాలను ప్రారంభించి గోమాతలకు పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారులపై ఆవులు, గేదెలు ఉండటం వల్ల ప్రజలంతా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక మంది ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఒకవైపు పశువులకు గాయాలు అవడమే కాకుండా మరోవైపు మనుషులు కూడా ప్రమాదాలకు గురై దెబ్బలు తగిలి చనిపోవడం జరిగిందన్నారు. అంతే కాకుండా ఆవులు, గేదెలు రహదారులపై ఉన్న ప్లాస్టిక్ కవర్లు తదితర పాడైపోయిన వస్తువులను తింటూ అనారోగ్యం పాలవుతున్నాయన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులతో మునిసిపల్, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలసి డి.ఎస్.పి నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ అంతా కలిసి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆవులు, గేదెలు కోసం ప్రత్యేకించి ఒక గోశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గోశాలలో 112 ఆవులు ఉన్నాయన్నారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

పెడన:ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి నవరాత్రులు జరిగేలా పటిష్ట చర్యలు చేపడుతున్నామని పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం రాత్రి పెడన పోలీస్ స్టేషన్‌లో పెడన ఎస్‌ఐ జి సత్యనారాయణతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. చవితి నవరాత్రుల మండపాలు పెట్టే వారు కమిటీగా ఏర్పడాలన్నారు.

మోపిదేవి:వినాయకచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ ఎలుగుబంటి వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఉదయం ఆయన మాట్లాడుతూ వినాయకచవితికి చలువపందిర్లు ఏర్పాటు చేసుకునే కమిటీ సభ్యులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసుకునే పందిర్ల నిర్వాహకులకు ప్రభుత్వం గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఊరేగింపు జరిగేటప్పుడు డీజేలు కొట్టకుండా, బాణసంచా కాల్చకుండా గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో ముందస్తుగా పోలీసులకు తెలియపర్చాలన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

కోనేరుసెంటర్: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని పందిళ్ళ నిర్వాహకులు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్‌పేట సీఐ ఏసుబాబు పందిరి నిర్వాహకులకు తెలిపారు. గణపతి నవరాత్రుల నిర్వాహకులతో శనివారం ఆయన ఆర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి నవరాత్రులను పురస్కరించుకుని నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై దిశానిర్దేశం చేశారు.

రైతులకు డీఏపీ ఎరువులు పంపిణీ

నాగాయితిప్ప(మోపిదేవి): మండల పరిధిలోని నాగాయితిప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ బల్లా సీతారామప్రసాద్ డీఏపీ ఎరువులు శనివారం పంపిణీ చేశారు. సొసైటీకి వచ్చిన 400 కట్టలను ఒక్కొక్క కట్ట రూ. 1350 చొప్పున రైతులకు విక్రయించినట్లు సొసైటీ కార్యదర్శి బోగాది లంకేశ్వరరావు తెలిపారు. సొసైటీ సభ్యులు రేపల్లె మునీశ్వరావు, పుప్పాల ఏసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న నిర్మాతలకు 30 శాతం రాయితీ ఇవ్వాలి

కోడూరు: సినిమాల నిర్మాణాల్లో పెరిగిన ఖర్చులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చిన్న సినిమాలు తీస్తున్న నిర్మాతలకు 30 శాతం రాయితీ కల్పించాలని సినీనిర్మాత, టీఎస్సార్ మూవీ మేకర్స్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు కోడూరులో శనివారం పాత్రికేయులతో మాట్లాడారు. చలన చిత్రసీమలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని, లేబర్ కమిషనర్, సినీ మండలి సంయుక్తంగా తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. చిన్న సినిమా, పెద్దసినిమా అనే భేదం లేకుండా చిత్రమండలి సూచించిన 24 ఫ్రేమ్స్ ఆధారంగానే అన్ని సినిమాలు చిత్రీకరణ జరగడంతో పాటు కార్మికుల వేతనాలు చెల్లింపు ఉంటుందని, ఇదే విధంగా చిన్న సినిమాలను బతికించేందుకు ప్రభుత్వాలు, సినీ మండలి ఆలోచన చేయాలన్నారు.

సుకన్య సమృద్ధి దరఖాస్తుల నమోదు

మచిలీపట్నంటౌన్: పోస్టల్ శాఖ సిబ్బంది సుకన్య సమృద్ధి అకౌంట్ దరఖాస్తుల నమోదు కార్యక్రమం జవ్వారుపేటలోని వెంకటేశ్వర ఈఎం హైస్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సున్నా నుంచి పది సంవత్సరాల బాలికల సంక్షేమం విద్యా వికాసం వివాహం కోసం ఈ సుకన్య సమృద్ధి అకౌంట్‌లను తెరిచారు. పోస్టల్ శాఖ సిబ్బంది మాట్లాడుతూ 2023 డిసెంబర్ రెండో తేదీ తర్వాత పుట్టిన ఆడపిల్లలు ఈ పథకంలో చేరేందుకు అర్హులుగా తెలిపారు. మొదట వెయ్యి రూపాయలతో ఖాతా తెరవచ్చునన్నారు. అనంతరం రూ. 100తో డిపాజిట్ చేయాలన్నారు. ఖాతా తెరిచిన తేదీ నుంచి 14 సంవత్సరాలు క్రమం తప్పకుండా డిపాజిట్ చెల్లించాలన్నారు. 18 సంవత్సరాల తర్వాత 50 శాతం వరకు బాలిక ఉన్నత చదువులు లేదా వివాహం కోసం ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేయవచ్చునని తెలిపారు.

సురవరం మృతి తీరని లోటు

చల్లపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఏపీ రైతు సంఘం నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ తెలిపారు. స్థానిక చండ్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో శనివారం సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షకు 384 మంది హాజరు

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం హైకోర్టు ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ ఎగ్జామ్‌కు 384 మంది హాజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఆర్‌ఎస్ రెడ్డి, అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు. మూడు సెషన్స్‌లలో జరిగిన ఈ పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మొదటి సెషన్‌లో 181 మందికి గాను 127 మంది హాజరయ్యారని, 54 మంది రాలేదని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 129 మంది హాజరయ్యారని, 51 హాజరవ్వలేదన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30గంటల వరకు జరిగిన మూడో సెషన్‌లో 180 మందికి గాను 128 మంది హాజరయ్యారని, 52 మంది అబ్సెంట్ అయ్యారన్నారు. మొత్తం మూడు సెషన్లకు 541 మందికి గాను 384 మంది హాజరయ్యారని, 157 మంది హాజరుకాలేదని వారు తెలిపారు.

శునకానికి క్లిష్టమైన శస్త్ర చికిత్స



శ్రీకాకుళం(ఘంటసాల):వారం రోజుల నుంచి మూత్ర విసర్జన చేయని పెంపుడు కుక్కకు శస్త్ర చికిత్స చేసిన ఘటన ఘంటసాల మండలం శ్రీకాకుళం పశువైద్య శాలలో వెటర్నరీ డాక్టర్ దేవిన హరీష్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. వేములపల్లి గ్రామానికి చెందిన పాటిబండ్ల నరేష్‌కు చెందిన లాబ్రడోర్ పెంపుడు కుక్క వారం రోజుల నుంచి మూత్ర విసర్జన చేయడం లేదని ఆసుపత్రికి తీసుకొచ్చారు. కుక్కను పరీక్షించిన డాక్టర్ హరీష్ అత్యవసర శస్త్ర చికిత్స చేయాలని చెప్పారు. శస్త్ర చికిత్స సమయంలో పగిలిన మూత్రాశయం నుంచి మూత్రం లీకేజీ కావడం వల్ల తీవ్రమైన పెరిటోనిటిస్ కనిపించి ఉదరం ద్రవంతో కలిసిపోయింది. దీంతో ఉదరం నుంచి సుమారు మూడు లీటర్ల చెడు ద్రవాన్ని తొలగించినట్లు చెప్పారు. తర్వాత బాగా దెబ్బతిన్న మూత్రాశయంను పరిశీలించినప్పుడు కుక్కలలో అసాధారణమైన కాలీఫ్లవర్ లాంటి మూత్ర మార్గ క్యాన్సర్ అయిన ట్రాన్సిషనల్ సెల్ కార్సినోమా (టీసీసీ)ను తొలగించిన తర్వాత యూరినరీ కాథెటర్‌ను ఉంచడం జరిగింది. శస్త్ర చికిత్స తర్వాత కుక్క సాయంత్రం మూత్ర విసర్జన సక్రమంగా చేసి కొంత చురుగ్గా కనిపించడంతో శస్త్రచికిత్స విజయవంతమైందని తెలిపారు.

పింఛన్లు ఆపి పొట్టకొట్టొద్దు..



ఎమ్మెల్యే కాగిత వద్ద తమ సమస్యను మొరపెట్టుకుంటున్న దివ్యాంగులు

బంటుమిల్లి: పింఛన్లు ఆపి తమ పొట్టకొట్టొద్దయ్యా అంటూ పలువురు దివ్యాంగులు ఎమ్మెల్యే ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదుకు మొరపెట్టుకున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌తో పాటు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులు ఎమ్మెల్యేకు తమ గోడు విన్నవించారు. వెరిఫికేషన్ పేరుతో తమ పింఛన్లు నిలిపేస్తున్నారని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వికలాంగుల శాఖ ఇచ్చిన సర్టిఫికెట్లు 90 శాతం ఉంటే విచారణ పేరుతో పక్షవాతం వచ్చిన తన కుమారుడు రాముకు 40 శాతం ఎలా ఇస్తారంటూ బాధితుడి తల్లి వెంకటేశ్వరమ్మ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు వద్ద మొరపెట్టుకుంది. అలాగే మువ్వల రాజెమ్మ, కొర్లపాడు సుజాత తదితరులు తమ వికలాంగ పింఛన్లు ఆపవద్దని విన్నవించారు. ప్రభుత్వం ఇచ్చే పింఛనే తమకు ఆధారమని ఏ పని చేయలేమని గోడు వెళ్లబోసుకున్నారు. వికలాంగులు తమ గోడు చెప్పుకునేందుకు గంటల తరబడి పడిగాపులు పడితే రాకరాక వచ్చిన ఎంపీ బాలశౌరి కనీసం బాధితుల సమస్య తెలుసుకోకుండా తనకేమీ సంబంధం లేనట్లు వెళ్లిపోవడం బాధితులను ఆవేదనకు గురి చేసింది.

మైక్రో ఫిల్టర్లు ప్రారంభం....

ముంజులూరు, సాతులూరు, ములపర్రు, నాగన్నచెరువు, బర్రిపాడు గ్రామాల్లో కోల్ ఇండియా సీఎస్సార్ ఫండ్స్ రూ. 67.89లక్షలతో నిర్మించిన మైక్రో ఫిల్టర్లను ప్రారంభించారు. అలాగే మల్లంపూడి గ్రామంలో ఎంపీ నిధులు రూ. 35 లక్షలతో నిర్మాణం చేయనున్న అదనపు స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు, ఎంపీ బాలశౌరి భూమిపూజ చేశారు. కంచడం గ్రామంలో బ్యాంకు ఆఫ్ ఇండియా నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచిని ప్రారంభించారు. ఎంపీపీ వి. చినబాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, సర్పంచులు కె.సునీత, జి.బాలస్వామి, మంగమ్మ, ఆర్.గోపాలకృష్ణ, ఆర్. శ్రీనివాసరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



ఎంపీడీవో కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో స్వర్ణభారతి, అధికారులు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ సిబ్బందిచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ శనివారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, భక్తులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. అనంతరం సిబ్బంది ఆలయ ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశుభ్రం చేశారు. స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఎంపీడీవో స్వర్ణభారతి కార్యాలయ సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు.

పెడన:పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు అధికారులు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర...స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని బల్లిపర్రు గ్రామంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రూతమ్మ, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులతో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్‌వి ప్రసాద్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రైతుబజారు వద్ద మున్సిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి హరికిషోర్, పారిశుధ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి పుర ప్రజలకు అవగాహన కల్పించారు.

గూడూరు:మచిలీపట్నం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రోజారమణి ఆధ్వర్యంలో కళాశాల బృందం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సులో హెచ్‌ఎం జి.విజయకుమారి, జి.వి.రాఘవమ్మ, ఎం.శైలజ, ఎం.జ్యోతి, పీడీ మత్తి అరుణ పాల్గొన్నారు.

చల్లపల్లి: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీకి చెందిన చెత్తసేకరణ వాహన డ్రైవర్లు వీరేష్, రాజేశ్వరరావును శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. తొలుత పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో రవిశంకరరావు, ఈఓ సుబ్బారావు పాల్గొన్నారు.

ఘంటసాలపాలెం(ఘంటసాల):ప్రజల సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యమని ఘంటసాలపాలెం సర్పంచ్ దోనె రజిని అన్నారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం, కొడాలి, ఘంటసాల, తెలుగురావుపాలెం, తదితర గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం



నగరపాలక సంస్థలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెడన: ఆంధ్ర రాష్ట్రానికి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని నందమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మద్ది బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. హైస్కూల్లో ప్రకాశం పంతులు జయంతిని శనివారం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి కె.జానకీలక్ష్మి, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కె. సత్యనారాయణ, పి.గణేష్, బీటీ నాగేశ్వరరావు, వై.లక్ష్మణరావు, వి.నాగమణి, ఎ. శ్రీనివాసరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.లావణ్య, సీహెచ్ దివ్యజ్యోతి, పి.ఆశ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శనివారం గూడూరులో ఘనంగా నిర్వహించారు. శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.డి.బషీర్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు రవి, బీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: బ్రిటిష్ పాలకుల తుపాకీలకు గుండె చూపిన మహాధీరుడు ప్రకాశం పంతులని పలువురు తెలిపారు. ఘంటసాల గ్రామ సచివాలయంలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతుల జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి ఘంటసాల ఈవో టి.జయలక్ష్మీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మచిలీపట్నంటౌన్: ఆంధ్ర రాష్ట్ర తొలి మాజీ ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని నగరంలోని పలు కార్యాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యాలయ ఇన్‌చార్జి మేనేజర్ కేవీఎస్ ప్రసాద్, పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆ సంస్థ జిల్లా కార్యదర్శి వి.రవికుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయ డెప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, పాల్గొన్నారు.

మోపిదేవి: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎంపీడీవో జె. స్వర్ణభారతి పూలమాలలు వేసి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇన్‌ఛార్జీ ఈఓపీఆర్‌డీ మల్లేశ్వరావు, ఏఓ పాండురంగారావు, గ్రామ కార్యదర్శి రామ కోటేశ్వరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో పలువురికి జిల్లా స్థాయి ర్యాంకులు

మోపిదేవి: ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో మోపిదేవి పంచాయతీ పరిధిలోని రావివారిపాలెంకు చెందిన ఇద్దరు మహిళలు ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. డీఎస్సీ–2025 మెరిట్ లిస్టును ప్రభుత్వం శుక్రవారం రాత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే. మెరిట్ లిస్టు ప్రకారం ఓపెన్ కేటగిరీలోనే మేకా ఆశ్లేష, స్కూల్ అసిస్టెంట్ (భౌతిక శాస్త్ర) విభాగంలో జిల్లా స్థాయిలో 11వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం మోపిదేవిలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. మరొకరు పాలిమెట్ల స్వయంప్రభ, సోషల్ అసిస్టెంట్‌లో (సామాజిక శాస్త్ర) విభాగంలో జిల్లా స్థాయిలో 20వ ర్యాంకు సాధించింది. ఈమె ప్రస్తుతం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నారు. మెరకనపల్లికి చెందిన యర్రంశెట్టి లెనిన్, స్కూల్ అసిస్టెంట్ (సామాజిక శాస్త్రం) విభాగంలో జిల్లా స్థాయిలో 28వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా లెనిన్‌తోపాటు ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు విజయం సాధించడంతో వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు అందచేశారు.

గ్రామాన్ని సందర్శించిన ఆర్డీవో స్వాతి



ఎడ్లంకలో కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో స్వాతి

ఎడ్లంక(అవనిగడ్డ): మండల పరిధిలోని ఎడ్లంక గ్రామాన్ని ఆర్డీవో కె. స్వాతి శనివారం సందర్శించారు. పలుశాఖల అధికారులతో కలసి ఆమె గ్రామంలో కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కోతకు గురికాకుండా రక్షణ గోడ, వంతెన నిర్మించాలని, వరదల వల్ల దెబ్బతిన్న బాధితులకు గృహాలు నిర్మించాలని, భూములు కోల్పోయిన వారికి భూములు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎడ్లంక గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్ష రెండవ రోజుకి చేరింది. ఈ సందర్భంగా ఆర్డీవో స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని కాపాడేందుకు రక్షణ గోడ నిర్మించడమే శాశ్వత పరిష్కారమని స్థానికులు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఆర్‌ఐ బాలాజీ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.